ఆరంభం అదిరింది

- వెంకన్నపాలెం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి ఇంటింటా ఓటర్లకు విన్నపం
- వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించాలని అభ్యర్థన


వెంకన్నపాలెంలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు


పైడితల్లమ్మ ఆలయంలో అర్చకుల ఆశీర్వాదం తీసుకుంటున్న అమర్‌నాథ్

పెదగంట్యాడ: రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ఎన్నికల ప్రచారానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ 64వ వార్డులోని వెంకన్నపాలెం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారిని ముందుగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి ప్రచారం ప్రారంభించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. వచ్చే ఎన్నికల్లో తనను గాజువాక ఎమ్మెల్యేగా గెలిపించాలని మంత్రి అమర్‌నాథ్ ఓటర్లను అభ్యర్థించారు. అలాగే విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీని కూడా గెలిపించాలని కోరారు. వెంకన్నపాలెంలోని ఓ ఇంట్లో వృద్ధుడిని కలుసుకున్న వారు అతడి ఆరోగ్యంపై ఆరా తీసి, పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల కొనసాగింపు, అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీని గెలిపించి, జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని ఓటర్లను కోరారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

గాజువాక నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1978లో గుడివాడ అప్పన్నకు, 1989లో గుడివాడ గురునాథరావుకు, 2019లో తిప్పల నాగిరెడ్డికి ఇక్కడి ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. తన తండ్రి గుడివాడ గురునాథరావు ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో దిబ్బపాలెం గ్రామంలో తుపాను షెల్టర్లు నిర్మించారని, యారాడ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఒకేసారి 700 ఇళ్లు నిర్మించి ఇచ్చారన్నారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 2 లక్షల 85వేల కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలను అమలు చేశారని, ఆ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఈ ప్రభుత్వంలో పారిశ్రామిక వాడల అభివృద్ధి జరిగిందని, పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.


ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న అమర్‌నాథ్

సమస్యలు పరిష్కరించాం: ఎమ్మెల్యే నాగిరెడ్డి

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాలనలోనే దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాక హౌస్ కమిటీ సమస్యతో పాటు ఫార్మాసిటీ నిర్వాసితుల సమస్యలు, ఏపీఐఐసీ ల్యాండ్ సమస్య, కర్ణవానిపాలెం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించామని వివరించారు. అమర్‌నాథ్ స్థానికుడు కావడంతో ఆయనకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

ఉమ్మడి విశాఖ వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను గజమాలతో సత్కరించారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

- గాజువాక విజయాన్ని సీఎం జగన్‌కు కానుకగా ఇద్దాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్


నాతయ్యపాలెంలో సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: రానున్న ఎన్నికల్లో గాజువాకలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేద్దామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాజువాక విజయాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. గాజువాక అభివృద్ధిలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేసిన కృషిని కొనియాడారు. వార్డులో ప్రతీ ఒక్కరు తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నీసా బేగం, బీసీ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, నాయకులు గండ్రెడ్డి రామునాయుడు, కాకి అప్పలరెడ్డి, సాలాది వెంకటరావు, అంగ బాబూరావు, బోగాది అప్పారావు, ఆకుల ఉపమాక తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం నాయకులతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అమర్‌నాథ్

ముస్లిం నాయకులతో అమర్‌నాథ్ భేటీ

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ముస్లిం నాయకుల మద్దతు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ మైనార్టీసెల్ నాయకుడు, గాజువాక మండల అధ్యక్షుడు ఎస్ఎండీ గౌస్ ఇంటికి వెళ్లి, ముస్లిం నాయకులతో సమావేశమయ్యారు. తమ మద్దతు పూర్తిస్థాయిలో అందిస్తామని ఈ సందర్భంగా గౌస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు హుస్సేన్ షేక్, దుబాయ్ బాషా, షేక్ ఆశ, మోతీభాయ్, ఖలీల్, పర్వేజ్, బాషా, హసన్, రఫీ, రైస్ మదీనా, కరణం వేణుగోపాలరావు, నజీర్, షకీల్, జకీర్, భద్రం, షరీఫ్, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

గెలుపునకు కృషి చేయండి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ 76వ వార్డు నాయకుడు దొడ్డి రమణను మంత్రి అమర్‌నాథ్ కలిశారు. తన గెలుపు కోసం పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో గుడివాడ లతీష్, బొడ్డేటి ప్రసాద్, కొండయ్య, విల్లూరి పైడారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుస్తక పఠనంతో అనంత విజ్ఞానం


మొబైల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావు

ఉక్కునగరం: పుస్తకాలయాలు భాండాగారాలని, పుస్తకాల ద్వారా అనంతమైన విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని స్టీల్‌ప్లాంట్ ఐఆర్ జీఎం కె.సంజీవరావు అన్నారు. ఉక్కునగరం సెక్టార్–2 కాంప్లెక్స్ వద్ద విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం అలవాటు చేస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని ఉక్కునగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జె.రామకృష్ణ, జి.బోసుబాబు, కె.రాజబాబు, బుక్ హౌస్ మేనేజర్ పి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ


పరదేశమ్మ అమ్మవారు

పెదగంట్యాడ: నడుపూరు శివారు బుచ్చెయ్యపేట, చుట్టుపక్కల గ్రామాల ఆరాధ్యదేవత పరదేశమ్మ వారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఇందల జగ్గారావు, ఇందల దేముడు, పాలిశెట్టి సూర్య అప్పారావు, జనపరెడ్డి సన్యాసిరావు, జనపరెడ్డి నాగేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నేలగరిడీలు, తప్పెట గుళ్లు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.

మగ్గం, జర్దోసిపై ముగిసిన శిక్షణ


శిక్షణ పొందిన మహిళలతో మేయర్ హరివెంకట కుమారి

అక్కిరెడ్డిపాలెం: మగ్గం, జర్దోసిపై తుంగ్లాంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి, భెల్ భజన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. 69వ వార్డు తుంగ్లాంలోని సత్యసాయి సేవా మందిరంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎస్.నాయుడు, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ ఇన్‌చార్జి అమ్మాజీ, బీహెచ్‌ఈఎల్, తుంగ్లాం భజన మండళ్ల కన్వీనర్లు రమేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకన్న ఆలయంలో పండిత సదస్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పండిత సదస్యం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు భావనారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సింహాచలానికి చెందిన రుత్వికుల ఆధ్వర్యంలో నిర్వహించిన పండిత సదస్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన రుత్వికులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.


పండిత సదస్యంలో రుత్వికులు

28న మరిడిమాంబ జాతర



అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి జాతరను ఈ నెల 28వ తేదీన నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ ప్రతినిధులు విందుల వెంకటరమణ, బలిరెడ్డి శ్రీను మాట్లాడుతూ 21న దుర్గమాంబ, 24న సత్తెమ్మతల్లి, 25న బంగారమ్మ తల్లి ఘటాల ఊరేగింపు జరిపించేందుకు కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే 27వ తేదీన మరిడిమాంబ అమ్మవారి ఊరేగింపు, కోటి దీపారాధన, 28వ తేదీన అమ్మవారి జాతర నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.రామచంద్రరావు, బి.సత్యనారాయణ, పి.రవి, పి.వసంతరావు, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సహస్ర కలశాల శోభాయాత్ర

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీపురంలో దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లిమ్మ అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం మహిళలు సహస్ర కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. దేవతా మూలమంత్ర హోమాలు, ధాన్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పాలు, వేదస్వస్తి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకులు ఇరగవరపు వాసు శ్రీధర్ స్వాముల పర్యవేక్షణలో నిర్వహించారు. సాయంత్రం కోలాటాలు, తప్పెటగుళ్లతో అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. 20వ తేదీన యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, సారె ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అవిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కుచ్చర్లపాటి రామరాజు, సెక్రటరీ సిరసపల్లి బాబూరావు, అప్పికొండ పెంటారావు, బెల్లంకొండ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

స్టీల్‌ప్లాంట్ విభాగాల్లో భద్రతా ర్యాలీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విభాగాల్లో భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 28న స్టీల్ సేఫ్టీ డే సందర్భంగా ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ఎఫ్), ఎల్ఎంఎం విభాగాల్లో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంజినీరింగ్ షాప్స్‌లో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి ఎస్.కె. పాండే, భద్రతా విభాగం డీజీఎం ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్మికులను కలిసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఎస్ఎఫ్ అధికారులు జి.సి.బోస్, బి.ఆర్.జెనా, ఎస్.డి.నాయక్, భద్రతా అధికారి పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఈఎస్ఎఫ్ విభాగంలో భద్రతా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, కార్మికులు

కొనసాగుతున్న ‘ఉక్కు’ రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షల్లో 1132వ రోజు, మంగళవారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఈఎస్ అండ్ ఎఫ్, ఈఆర్ఎస్, ఈఎండీ, సేఫ్టీ, టెక్‌సెల్, ఆగ్రో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

సింహగిరిపై విశేషంగా హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయంలో మంగళవారం హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. హోమ గుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.అనంతరం కుంభప్రోక్షణ జరిపారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ఆలయ అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పైడిమాంబ ఉత్సవాలు ప్రారంభం


అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చింనాయుడు ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. స్థానిక మహిళలు పూర్ణకుంభాలతో, పసుపు కుంకుమలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఘటాలను ఎత్తుకున్న వారి పాదాలకు జలాభిషేకం చేశారు. చీరలు చూపించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కొంగ పైడమ్మ సన్నిధిలో మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

ఘనంగా కొంగ పైడమ్మ తల్లి పండగ

కొంగపాలెం గ్రామ దేవత కొంగ పైడమ్మతల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. వెంకన్నపాలెం, కొంగపాలెం, యాతపాలెం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు, చీర, సారె సమర్పించారు. మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పల గురుమూర్తిరెడ్డి, దేవన్ రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

సీఎం జగన్ పాలనలో ఎన్నో సంస్కరణలు

- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- 87వ వార్డు పార్టీ నాయకులతో విస్తృత సమావేశం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్

కూర్మన్నపాలెం: అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నూతన సంస్కరణలు–పరిపాలన వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించిన తీరు దేశానికే ఆదర్శమన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ఆర్యవైశ్య సామాజిక భవనంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ నాయకుడు తిప్పల దేవన్‌రెడ్డితో కలిసి నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వార్డు, గ్రామ సచివాలయాలు, జిల్లాల పునర్విభజన ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించారన్నారు. పోర్టులు, షిప్పింగ్ యార్డులు, రహదారుల వంటి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేశారన్నారు. దీంతో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తుండటంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ నానాటికి పెరుగుతోందని, దీనిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బుద్ధి వచ్చేలా గట్టి గుణపాఠం నేర్పుతారని అన్నారు.

జగన్ వంటి ముఖ్యమంత్రి ఎంతో అవసరం

రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి వంటి ముఖ్యమంత్రి ఎంతో అవసరమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే వైఎస్సార్‌సీపీకి మరోసారి ఘన విజయాన్ని కట్టబెడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జిల్లా యువజన అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, మండలాధ్యక్షులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, బొడ్డేటి మెదీనాయుడు, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, సబ్బవరపు పార్వతి, గాలి రమణమ్మ, వర్రె రాజు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

క్షయ నివారణపై అవగాహన

కూర్మన్నపాలెం: క్షయ వ్యాధి నివారణపై 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, క్షయవ్యాధి నివారణ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. మార్చి 24వ తేదీ ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కణితి, వడ్లపూడి, సిద్ధార్థనగర్, రాజులపాలెం జంక్షన్ల వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. వడ్లపూడి జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. క్షయ ఏ విధంగా వ్యాపిస్తుంది, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శివయ్య, ఈవో బాబీ తదితరులు పాల్గొన్నారు.


వడ్లపూడి జంక్షన్ వద్ద అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

టెన్త్ పరీక్షలకు 20 మంది గైర్హాజరు


మింది హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

గాజువాక: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు గాజువాక మండలంలోని వివిధ కేంద్రాల్లో రెండో రోజు 20 మంది గైర్హాజరయ్యారు. మరో విద్యార్థికి అధికారులు మినహాయింపునిచ్చారు. మండలంలో మొత్తం 20 కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు 4080 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4059 మంది మాత్రమే హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి సునీత తెలిపారు. రెండో రోజు పరీక్షలు కూడా ప్రశాంతంగా సాగాయని పేర్కొన్నారు.